epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 39 | ఆదివారం | 26.05.2024



## సమన్వయంతో పనిచేయాలి

- పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

2లో..




ఆలోచించి ఓటెయ్యాలి : రఘునందన్‌రావు 2



### తీన్మార్ మల్లన్నపై తప్పుడు ప్రచారాలు 3

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం



### అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ సీరియస్ 2

- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



### బాయ్ ఫ్రెండ్‌కి బ్రేకప్ చెప్పిన శ్రుతి 4

- ఇన్‌స్టాలో అభిమానులకు క్లారిటీ

మన చౌరాస్తా 2
26.05.2024 ఆదివారం
epaper.manachourasta.com

General News

# సమన్వయంతో పనిచేయాలి

- పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా:** ఈ నెల 27న నిర్వహించే వరంగల్,ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. శనివారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశం మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి ఆయన పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ నిర్వహణపై నోడల్ అధికారులు, పీఓలు, ఏపీవోలు, ఓపీఓలు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 27న నిర్వహించే పట్టభద్రుల ఉప ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు తెలిపారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ల వ్యాప్తంగా 23,419 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించుటలో పీఓలు, ఏపీఓలు, ఓపీఓల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికల్లో 34 మంది పీఓలు, 34 మంది ఏపీఓలు, 74 మంది ఓపీఓలు, 32 మంది మైక్రో అబ్జర్వర్లకు విధులు కేటాయించామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు సమన్వయంతో పనిచేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పట్టభద్రుల ఉప ఎన్నికల్లో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బ్యాలెట్ జారీ తదుపరి కౌంటర్ ఫైల్ పై ఓటరు సంతకం తీసుకోవాలన్నారు. పురుష, మహిళా ఓటర్ల సంఖ్యను నమోదు చేయాలని ఆయన పేర్కొన్నారు. బ్యాలెట్ పేపరును ఓటరుకు ఇచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అలాగే ఓటర్లు ఓటు హక్కు వినియోగంలో పోలింగ్ సిబ్బంది ఇచ్చిన వాయిలెట్ కలర్ స్కెచ్ పెన్ తో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎదురుగా క్రమ సంఖ్యలు వేయాలని తెలిపారు. ఓటరు ఓటు వేసే వ్యక్తి పేరు ప్రక్కన 1 నుంచి నంబర్లు వేయాలని, నంబర్లు వేయకపోతే ఓటు చెల్లుబాటు కాదని తెలిపారు. పీఓ ఇచ్చిన వాయిలెట్ పెన్ కాకుండా ఇతర రంగుల పెన్నులు వాడితే బ్యాలెట్ చెల్లుబాటు కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి బ్యాలెట్ పేపర్ పై పోలింగ్ అధికారి సంతకం చేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పీఓతో పాటు ఏపీఓ, ఓపీఓ ఉంటారని తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ లను ఓపెన్ చేసి చూపాలని తెలిపారు. పోలింగ్ బాక్సులకి పకడ్బందీగా సీల్ వేయాలన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తామని వివరించారు. టెండర్, ఛాలెంజ్ ఓట్లు వేస్తే ప్రత్యేక ఎన్వలప్ లో పీఓ భద్రపరచాలని, ఆ ఓట్ల వివరాలను పీఓ డైరీలో నమోదు చేయాలన్నారు. ఫార్మ్ 16, పేపర్ సీల్ అకౌంట్లను అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. ఓటరుకు ఎడమ చేతి మధ్య వేలుకు ఇండిబుల్ ఇంకు పెట్టాలన్నారు. పట్టభద్రుల ఉప ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మంచినీరు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. సమీకృత కలెక్టర్ కార్యాలయంలోనే పోలింగ్ మెటీరియల్ పంపిణీ (డిస్ట్రిబ్యూషన్), రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని, అదే రోజు పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలన్నారు.

అంతకుముందు పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల సీలింగ్ విధానంపై ఎన్నికల అధికారులందరికీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, ఎన్నికల విభాగం సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై కొరడా

- వెంటనే తొలగించండి
- అధికారులకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాలు




**హనుమకొండ, మన చౌరాస్తా :** రాజాజీ నగర్ నుంచి బొక్కల గడ్డ వరకు ఎలాంటి అక్రమ నిర్మాణాలు ఉన్నా వెంటనే వాటిని తొలగింపు చర్యలు చేపట్టి నయీమ్ నగర్ నాలా నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తో కలిసి నయీమ్ నగర్ నాలా నిర్మాణ పనులపై రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సర్వే, సాగునీటి పారుదల, ఇతర శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నయీమ్ నగర్ నాలా నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులను ఆయా శాఖల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నయీమ్ నగర్ నాలా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా వరద ప్రభావంతో నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా నయీమ్ నగర్ నాలా నిర్మాణ పనులను గడువులోగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. నాలా ఆక్రమణల తొలగింపు చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు నాలా స్థలం ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, గ్రేటర్ వరంగల్ ఈఈ రాజయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులు ఆలోచించి ఓటెయ్యాలి

- తీన్మార్ మల్లన్నకు బ్లాక్ మెయిలింగ్ తప్ప ఏదీ రాదు
- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు వాస్తవాలు గ్రహించి ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రఘునందన్ రావు పేర్కొన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పట్టభద్రుల సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ తో కలిసి రఘునందన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లుండి జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటర్లు ఎవరికి ఓటు వేస్తే మేలు జరుగుతుందని ఆలోచించి ఓటు వేయాలన్నారు. రేవంత్ రెడ్డి 420 హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను మభ్య పెట్టారని విమర్శించారు. ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి అని అన్నారు. సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టగానే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్నాడని.. గతంలో నిరుద్యోగులను దుష్ప్రచారం చేసి కాంగ్రెస్ రెచ్చగొట్టిందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనైనా నిరుద్యోగులు వాస్తవాలు గ్రహించి ఓటు వేయాలని కోరారు. తీన్మార్ మల్లన్న ఎక్కడ చదువుకున్నాడో తెలియదని.. తీన్మార్ మల్లన్నకు బ్లాక్ మెయిలింగ్ తప్ప ఏదీ రాదని విమర్శించారు. ప్రశ్నించే వారిని ఇష్ట మొచ్చినట్టు తిట్టడమే తీన్మార్ మల్లన్న పని అని ఎద్దేవా చేశారు. పొద్దున లేస్తే ఇతరులపై దుర్భాషలాడే మల్లన్నకు ఎందుకు ఓటు వేయాలని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 27 వ తేదిన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడు బీజేపీ పార్టీలోనే 40 సంవత్సరాలుగా సేవ చేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత (1) ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ప్రభారీ మురళీధర్ గౌడ్, జిల్లా అధ్యక్షులు దశమంత రెడ్డి, అసెంబ్లీ ఎన్నికల ఇన్చార్జి శ్రీనివాసరావు, జిల్లా నాయకులు విజయ రావు, సుభాష్, వెంకటేశ్వర్లు, అసెంబ్లీ కన్వీనర్ అంజిరెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ యుగంధర్, మహిళా మోర్చ నాయకురాలు విజయలక్ష్మి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు వలి పాషా, మండల పార్టీ అధ్యక్షుడు రమణ, రాజు యాదవ్, నగేష్ గౌడ్, ఉపేందర్, రాజు, ఆంజనేయులు, వేణు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి అలాగోని నరసింహులు గౌడ్ (ప్రిన్సిపాల్) తెలిపారు. జనగామ జిల్లా వ్యాప్తంగా 5 కళాశాలలు ఉన్నాయి. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ (బాలురు)కు సంబంధించినవి, బాలికలకు సంబంధించిన కళాశాలలు పాలకుర్తి, జఫర్‌గడ్, నర్మెట (ప్రస్తుతం నర్మెట కళాశాల చేర్యాలలో కలదు) పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 24 నుంచి 31 వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్ సైట్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులో అడ్మిషన్స్ ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము రూ.100 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

Local News



# తీన్మార్ మల్లన్నపై తప్పుడు ప్రచారాలు

## ప్రెస్ మీట్‌లో కడియం శ్రీహరి

**స్టేషన్ ఘనపూర్, మన చౌరాస్తా :** ఈనెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు తో గెలిపించాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం స్టేషన్ ఘనపూర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. తీన్మార్ మల్లన్న గెలుపు ద్వారా పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాడన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ను సీఎం రేవంత్ రెడ్డి గారు ప్రకటించానున్నారని ఆయన తెలిపారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీ లు చేస్తున్న తప్పుడు ప్రచారానికి మోసపోవద్దన్నారు. పట్టభద్రులు వివేకంతో అలోచించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలన్నారు. కేంద్రంలో 10ఏళ్ళు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువతకు చేసింది ఏమి లేదని కడియం ఆరోపించారు. నరేంద్ర మోడీ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పాడని, 10 ఏళ్ళు అధికారంలో ఉండి 20లక్షల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం, బీజేపీ పార్టీ యువతను మోసం చేసింది, దగా చేసిందన్నారు. తెలంగాణ విభజన చట్టంలోని హామీలలో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఎందుకు బీజేపీకి, నరేంద్ర మోడీకి తెలంగాణపై వివక్ష అన్నారు. తెలంగాణలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు, , స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు,ఒక్క విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయలేదన్నారు.తెలంగాణ బీజేపీ నాయకులు ఎం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. గత 5ఏళ్లుగా కిషన్ రెడ్డి గారు మంత్రి వర్గంలో ఉండి ఎం చేశాడన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఏ మాత్రం సహకరించని బీజేపీకి తెలంగాణ ప్రజలు ఎందుకు ఓటు వేయాలన్నారు. తెలంగాణ యువత బీజేపీని నిలదీయాలన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే నైతిక అర్హత బీజేపీకి లేదని ఆయన స్పష్టం చేసారు. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు లోపయాకరి ఒప్పందాలు చేసుకున్నారని కడియం శ్రీహరి విమర్శించారు. ఎంపీ ఎన్నికలలో బీజేపీకి బిఆర్ఎస్ సపోర్ట్ చేసిందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తె చెత్త బుట్టలో వేసినట్లేనన్నారు. బిఆర్ఎస్ గెలిచేది లేదు... గెలిచినా చేసేది ఎం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ ఉంటుందో... ఉండదో... తెలియని పరిస్థితి అన్నారు. బిఆర్ఎస్ కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు చెప్పుకొని రాజకీయాలు చేసిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఆ కాళేశ్వరం ప్రాజెక్టే బిఆర్ఎస్ ను ముంచిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పట్టభద్రులు ఒక్కసారి అలోచించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గారిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కడియం శ్రీహరి కోరారు.

WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way



'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



# మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ కేంద్రంలోని 17వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పెట్లోజు పరమేశ్వరచారీ (42) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అక్కడికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.



# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ప్రజల కోసం పోరాడే సీపీఎం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు కోరారు. శనివారం మండలంలోని కుర్చపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ గ్రామ కమిటీ సమావేశం పి.నరేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రాపర్తి రాజు హాజరై మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ముఖ్యమైన వాగ్దానాలను గ్యారంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా డబ్బులు రాని రైతులందరికీ తక్షణమే రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలని అన్నారు. 2 లక్షల రైతు రుణమాఫీ చేసి కొత్తగా రుణాలు రైతులకు ఇవ్వాలని అన్నారు. గ్రామాల్లో గ్రామ పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, ప్రజా సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనపడటం లేదని స్థానిక సంస్థల ఎన్నికలలను షెడ్యూల్ కనుగుణంగా నిర్వహించి గ్రామాలాభివృద్ధికి పాటుపడాలని అన్నారు. కుర్చపల్లి గ్రామంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం ఎర్రజెండా ఎగరవేయాలని అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. కుర్చపల్లి గ్రామంలో శనివారం అనారోగ్యంతో మరణించిన సీపీఎం సానుభూతిపరుడు తోకల మైసయ్య మృతదేహంపై ఎర్రజెండా కప్పి సీపీఎం జిల్లా, మండల గ్రామ నాయకులు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్, గ్రామ కార్యదర్శి కాసాని పుల్లయ్య, సభ్యులు మాజీ ఉపసర్పంచ్ మంచాల మల్లేష్, నాయకులు నరేష్, తోకల రాజు, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



## బాయ్ ఫ్రెండ్‌కి
# బ్రేకప్

### ఇన్ స్టాలో క్లారిటీ ఇచ్చిన శ్రుతి హాసన్

మన చౌరాస్తా, సినిమా : స్టార్ హీరోయిన్ శ్రుతి హాసన్ తన బాయ్ ఫ్రెండ్ ఢిల్లీకి చెందిన ప్రముఖ డూడుల్ ఆర్టిస్ట్ శాంతను హజారికతో గత కొన్నేళ్లుగా ప్రేమలో మునిగిపోయారు. ఈ విషయాన్ని నాలుగేళ్ల కింద ప్రకటించారు. వీరిద్దరూ దిగిన ఫొటోలను తరచూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వారు. అయితే ఈ మధ్య బ్రేకప్ వార్తలు జోరందుకున్నాయి. ఈ విషయంపై ఇన్ స్టాలో తాజాగా క్లారిటీ ఇచ్చింది. 'ఆస్క్ మీ ఎనిథింగ్' పేరిట ఫాలోవర్స్‌తో శ్రుతి ఇన్ స్టా వేదికగా ముచ్చటించింది. ఈ సందర్భంగా ఓ నెటిజన్ 'మీరు సింగిలా.. రిలేషన్‌లో ఉన్నారా' అని ప్రశ్నించారు. దీంతో ఈ విషయంపై స్పందించిన శృతి.. 'నాకు ఈ తరహా ప్రశ్నలు నచ్చవు. కానీ చెబుతున్నాను. ఇప్పుడు నేను సింగిలే. రిలేషన్ కోసం ఎదురుచూస్తున్నా. ప్రస్తుతానికి పనిలో మునిగిపోయాను. జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నా..' అంటూ సమాధా నమిచ్చింది. దీంతో శ్రుతిహాసన్ తన బాయ్ ఫ్రెండ్ తో విడిపోయినట్లు కొంతకాలంగా వస్తున్న వార్తలు నిజమేనని తేలిపోయింది. అయితే గత కొన్ని రోజులుగా ఎలాంటి ఫొటోలను షేర్ చేయకపోవడంతో వీళ్లిద్దరూ విడిపోయారనే ప్రచారం మొదలైంది. అంతేకాదు నెల కింద శ్రుతిహాసన్, శాంతను ఇన్ స్టాలో అన్ ఫాలో చేసుకున్నారు. వీరిద్దరూ కలిసి ఉన్న ఫొటోలను కూడా ఇద్దరు డిలీట్ చేయడంతో బ్రేకప్ వార్తలు మరింత జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో వీరి బ్రేకప్‌పై శ్రుతి తాజాగా క్లారిటీ కూడా ఇచ్చింది.